సాక్షి
విశాఖపట్నం
బుధవారం। 17। సెప్టెంబర్। 2025



రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన రెండో రోజు మంగళవారం జరిగిన కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి



సచివాలయాల్లో పనిభారం, వేధింపులు 8లో



పాంగి కరుణకు సత్కారం 8లో

న్యూస్‌రీల్

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు స్వాగతం



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న నిర్మలా సీతారామన్, మాధవ్ తదితరులు

గోపాలపట్నం : కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ఢిల్లీ నుంచి విమానంలో మంగళవారం రాత్రి విశాఖ చేరుకున్నారు. ఆమెకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తదితర నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆమె విమానాశ్రయం నుంచి రాడిసన్ హోటల్‌కు వెళ్లారు. సీఐఐ ఆధ్వర్యంలో రాడిసన్ బ్లూ హోటల్‌లో బుధవారం జరగనున్న గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్(జీసీసీ) మోడల్ పాలసీ సదస్సులో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పాల్గొననున్నారు.

సౌత్ కోస్ట్ రైల్వే జోనల్ కార్యాలయ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్

తాటిచెట్లపాలెం: ముడసర్లోవ వద్ద జరుగుతున్న జోనల్ ప్రధాన కార్యాలయం నిర్మాణ పనులను సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ మంగళవారం పరిశీలించారు. నిర్మాణ పురోగతిని, ఇంకా పూర్తి చేయాల్సిన పనుల వివరాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సౌత్ కోస్ట్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ అంకుష్ గుప్తా, చీఫ్ ఇంజినీర్ (కన్‌స్ట్రక్షన్) డి.శ్రీనివాసరావు, ఓఎస్డీ బి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

సింహాచలం : సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఈ పూజల్లో పాల్గొనే భక్తులు రూ.1000 టికెట్ తీసుకోవాలన్నారు. నేరుగా కానీ, పరోక్షంగా కానీ పూజలో పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. పరోక్షంగా పాల్గొనే భక్తులు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, సింహాచలం బ్రాంచ్, అకౌంట్ నెంబరు 11257208642, ఐఎఫ్ఎస్‌సి కోడ్-ఎస్‌బీఐఎన్0002795, యుపీఐ ఐడి-eosvlnsd@sbijకి నగదు బదిలీచేయవచ్చన్నారు. వివరాలకు 6303800736 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

స్టీల్‌ప్లాంట్ పర్సనల్ డైరెక్టర్‌గా రాకేష్ నందన్ సహాయ్



ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ నూతన డైరెక్టర్ (పర్సనల్)గా ఎన్‌టీపీసీ హెచ్‌ఆర్ అదనపు జనరల్ మేనేజర్ రాకేష్ నందన్ సహాయ్ ఎంపిక య్యారు. స్టీల్‌ప్లాంట్ ప్రస్తుత డైరెక్టర్ (పర్సనల్)ఎస్.సి.పాండే ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనుండటంతో ఈ ఎంపిక చేశారు. పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డు (పీఈఎస్‌బీ) ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఇంటర్వ్యూకు విశాఖ స్టీల్‌ప్లాంట్ నుంచి నలుగురు, బీఎస్ఎన్ఎల్ నుంచి ఇద్దరు, ఎన్టీపీసీ నుంచి ఇద్దరు, ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్, ఓఎన్‌జీసీ నుంచి ఒక్కొక్కరు హాజరయ్యారు. వారిలో ఎన్టీపీసీకి చెందిన రాకేష్ నందన్ సహాయ్‌ను ఎంపిక చేసినట్టు పీఈఎస్‌బి వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

ఐటీఐలో నాలుగో విడత కౌన్సెలింగ్

కంచరపాలెం: జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణ సంస్థలు(ఐటీఐ), అల్లూరి సీతారామరాజు జిల్లా నరవ ప్రభుత్వ పాత ఐటీఐ ప్రాంగణంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి మిగులు సీట్ల భర్తీ కోసం నాలుగో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ జె.శ్రీకాంత్, నరవ ఐటీఐ ప్రిన్సిపాల్ బి.విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 27వ తేదీలోగా https://iti.ap.gov.in/ అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 28వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటలోపు ధ్రువపత్రాల పరిశీలన చేయించుకోవాలన్నారు. 29, 30 తేదీల్లో కౌన్సెలింగ్ ఉంటుందని, అభ్యర్థులు ఏ ఐటీఐలో దరఖాస్తు చేసుకున్నారో, అదే ఐటీఐలో కౌన్సెలింగ్ ఉంటుందని స్పష్టం చేశారు.

టూర్ పేరుతో టార్గెట్లు!



కార్పొరేటర్ల అధ్యయన యాత్రకు జీవీఎంసీలోని అన్ని విభాగాల నుంచి కలెక్షన్

- జీవీఎంసీ రెవెన్యూ విభాగానికి భారీ లక్ష్యం
- ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, వాటర్ వర్క్స్ నుంచి వసూళ్లు
- అందరికీ ఇవ్వాలంటూ తెగబడిన జీవీఎంసీలోని కీలక నేత
- కోటి రూపాయలు దండుకున్నట్టు ఆరోపణలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో కూటమి నేతల వసూళ్ల పర్వానికి అంతులేకుండా పోతోంది. ఇప్పటికే స్టాండింగ్ కమిటీ పేరుతో వసూళ్లకు తెగబడిన కూటమి నేతలు.. ఇప్పుడు కార్పొరేటర్ల అధ్యయన యాత్ర పేరుతో టార్గెట్లు విధించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. జీవీఎంసీలో కీలకంగా వ్యవహరిస్తున్న నేత విభాగాల వారీగా లక్ష్యాలు విధించి మరీ భారీగా వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, వాటర్ వర్క్స్, రెవెన్యూ, పబ్లిక్ హెల్త్, యూసీడీ ఇలా అన్ని విభాగాల అధికారులను పిలిచి ఇంత మొత్తం వసూలు చేసి ఇవ్వాలంటూ లక్ష్యాలు విధించినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నెల 16వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జైపూర్, జోద్‌పూర్, జైసల్మార్, ఢిల్లీ ప్రాంతాల్లో అధ్యయన యాత్ర పేరుతో జీవీఎంసీ కార్పొరేటర్లు వెళుతున్నారు. ఈ యాత్రకు జనసేనకు చెందిన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్, సీపీఎం కార్పొరేటర్ గంగారావుతో సహా 15 మంది దూరంగా ఉంటున్నారు. అయితే, కార్పొరేటర్లు టూర్ వెళుతున్నందున.. కూటమి కార్పొరేటర్లకు కొంత మొత్తం ఖర్చుల కోసం ఇవ్వాలంటూ ఈ వసూళ్లకు దిగినట్టు తెలుస్తోంది. ఇప్పటికే కొన్ని విభాగాల నుంచి సదరు కీలక నేతకు భారీ మొత్తం ముట్టినట్టు కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొత్తంగా కోటి రూపాయల మేర ఈ విధంగా దండుకున్నట్టు తెలుస్తోంది.

సీఎం కంటే టూరే ముద్దు!

వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం విశాఖ వస్తున్నారు. అయితే, సీఎం నగరానికి వస్తున్న సమయంలో ప్రొటోకాల్ మేరకు నగర ప్రథమ పౌరుడు మేయర్ స్వాగతం పలకాల్సి ఉంటుంది. అయినప్పటికీ సీఎం పర్యటనకు ముందు రోజే మేయర్ పీలా శ్రీనివాసరావు విమానంలో పర్యటనకు వెళ్లిపోవడంపై సొంత పార్టీలోనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నగర ప్రథమ పౌరుడిగా సీఎంకు స్వాగతం పలకకుండా టూర్‌కు వెళ్లడం ఏమిటంటూ వాపోతున్నారు. ఇప్పటికే మేయర్ వ్యవహారశైలిపై గుర్రుగా ఉన్న సొంత పార్టీకి చెందిన నేతలు.. ఇదే విషయంపై నేరుగా సీఎం చంద్రబాబుకు కూడా ఫిర్యాదు చేయనున్నట్టు తెలుస్తోంది.

వసూళ్ల పర్వం...!

వాస్తవానికి కూటమి నేతలు జీవీఎంసీ పగ్గాలు చేపట్టిన తర్వాత కొత్త ప్రాజెక్టును కూడా ప్రారంభించలేదు. పైగా చికెన్ వ్యర్థాల పేరుతో జోన్‌ను ఒకరిద్దరు నేతలు పంచుకుని మరీ చేపలు, ఎరువుల చెరువుల యజమానులకు విక్రయించుకుంటున్నారు. ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకుంటూ జీవీఎంసీ పరువును కాస్తా రోడ్డున పడేశారు. ఇక స్టాండింగ్ కమిటీ పేరుతో పనులను ఆమోదించేందుకు 10 శాతం మేర కమీషన్‌ను వసూలు చేశారన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. అంతేకాకుండా అనధికార కట్టడాలకు అంతస్తుకు ఇంత మొత్తం ఇవ్వాల్సిందేనంటూ లక్షలకు లక్షలు బిల్డర్ల వద్ద నుంచి తీసుకుంటున్నారు. ఇక పోస్టింగుల కోసం కూడా జీవీఎంసీలోని కీలక నేత భారీగా దండుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇవి చాలదన్నట్టుగా ఇప్పుడు టూర్ పేరుతో కూడా టార్గెట్లు విధించడంపై జీవీఎంసీలోని అధికారులతో పాటు కాంట్రాక్టర్లు కూడా మండిపడుతున్నారు. ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్‌తో పాటు రెవెన్యూ అధికారులకు భారీగా టార్గెట్లు విధించారని తెలుస్తోంది. అధికారికంగా ఈ టూర్ కోసం జీవీఎంసీ ఖజానా నుంచి ఒక కోటి 53 లక్షల రూపాయల మేర ఇప్పటికే నిధులను విడుదల చేయగా... అనధికారికంగా మరో కోటి రూపాయల మేర వసూళ్లు చేసినట్టు ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

వ్యతిరేకత తగ్గించుకునేందుకు...!

వాస్తవానికి సదరు జీవీఎంసీలోని కీలక నేత వ్యవహారశైలిపై రోజురోజుకీ సొంత పార్టీ నేతలతో పాటు కూటమి కార్పొరేటర్ల నుంచి కూడా వ్యతిరేకత పెరుగుతోంది. మొదట్లో అందరితో కలుపుగోలుగా ఉన్నట్టు నటించిన సదరు నేత.. ఇప్పుడు అందరితోనూ అంటీముట్టనట్టుగా ఉంటున్నారనే ఆరోపణలున్నాయి. అంతేకాకుండా వసూళ్ల వ్యవహారంలో ఎవరితో సంబంధం లేకుండా సొంత టీంతో వ్యవహారాలు సాగించడంపైనా లోలోపల రగిలిపోతున్నారు. ఈ నేపథ్యంలో మొన్నటి వరకూ ఆయన వ్యవహారశైలి పట్ల మండిపడిన ముగ్గురికే ఈ వసూళ్ల బాధ్యతలు అప్పగించినట్టు సమాచారం. తద్వారా వ్యతిరేకత తగ్గించుకునేందుకు ఈ టూర్‌ను ఉపయోగించుకుంటున్నారని తెలుస్తోంది. అక్షరాలా కోటి రూపాయలను దండుకోవాలని లక్ష్యంగా పెట్టుకుని మరీ ముక్కుపిండి మరీ వసూలు చేసినట్టు తెలుస్తోంది. ఇప్పటికే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పబ్లిక్ హెల్త్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్ విభాగాల్లోని అధికారులను గుర్తించి.. వారికే వసూళ్ల బాధ్యతలను అప్పగించినట్టు తెలుస్తోంది.

సీఎం పర్యటనను విజయవంతం చేయండి

అధికారులకు జేసీ మయూర్ అశోక్ ఆదేశం

మహారాణిపేట: నగరంలో బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనను సమన్వయంతో విజయవంతం చేయాలని అధికారులను జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. మంగళవారం ఆయన ఏర్పాట్లపై సమీక్షించారు. ముఖ్యమంత్రి ముందుగా ఏయూ సాగరిక హాలులో మహిళలు, పిల్లలకు జరిగే హెల్త్ స్క్రీనింగ్ పరీక్షల తీరును, అక్కడ ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలిస్తారని చెప్పారు. అనంతరం ఏయూ కన్వెన్షన్ హాల్‌లో ప్రధాని మంత్రి చేతుల మీదుగా వర్చువల్‌గా ప్రారంభం కానున్న స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగస్వామ్యం కానున్నారని, అనంతరం సభను ఉద్దేశించి ప్రసంగిస్తారని పేర్కొన్నారు. అలాగే రాడిసన్ బ్లూ హోటల్‌లో జరిగే జీసీసీ (గ్లోబల్ క్యాపబుల్ సెంటర్) బిజినెస్ సమ్మిట్‌లో పాల్గొంటారని తెలిపారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరగనున్న స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తొలి రోజు సాగరిక హాల్‌లో సుమారు మూడు వేల మందికి క్యాన్సర్ హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 11 రకాల ప్రాథమిక వైద్య పరీక్షలు చేస్తారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో, విమ్స్‌లో 15 రోజుల పాటు మహిళలకు, పిల్లలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారు.

సాగరిక హాల్‌లో ఏర్పాట్ల పరిశీలన

మహారాణిపేట: ఏయూ సాగరిక హాల్‌లో 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమం సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను రాష్ట్ర కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీర పాండియన్, జేసీ మయూర్ అశోక్ మంగళవారం పరిశీలించారు. కార్యక్రమానికి 20 మంది స్పెషలిస్టు డాక్టర్స్, 10 మంది డ్యూటీ డాక్టర్స్, 20 మంది పారా మెడికల్ సిబ్బంది నియమించారు. క్షేత్ర స్థాయిలో 132 మెడికల్ క్యాంప్స్, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో 66, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 8, సామాజిక ఆరోగ్య కేంద్రాలు-3, ఏరియా ఆసుపత్రి-1, ఆరోగ్య ఉప కేంద్రాల్లో మహిళలకు ఉచితంగా పరీక్షలు చేయనున్నట్లు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు.

అంబరం.. ఉట్ల సంబరం



స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



ఉట్టి అందుకుంటున్న యాదవుడు నమ్మి అప్పలరాజు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి మంగళవారం శ్రీకృష్ణాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. సింహగిరిపై జరుగుతున్న శ్రీకృష్ణ జయంతి వేడుకల్లో భాగంగా సాయంత్రం ఉట్ల సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని కనులారా తిలకించారు. ఆనంద డోలికల్లో మునిగితేలారు. సాయంత్రం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి శ్రీకృష్ణాలంకారం చేసి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకిలో వేంజేపచేశారు. తొలుత ఆలయ బేడా తిరువీధి నిర్వహించారు. తదుపరి ఉత్సవమూర్తులను రాజగోపురంలో వేంజేపచేశారు. ఆలయ ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు తాడు లాగగా స్థానిక యాదవుడు నమ్మి అప్పలరాజు ఉట్టిని అందుకున్నాడు. అనంతరం స్వామికి విశేషంగా హారతులిచ్చారు. భక్తులకు తీర్థాన్ని, వెన్నప్రసాదాన్ని అందజేశారు. తదుపరి సింహగిరి మాడ వీధుల్లో స్వామికి తిరువీధిని నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు ఈ ఉత్సవాన్ని జరిపించారు.

బకాయిలు చెల్లించాలని టీచర్ల ధర్నా



కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న ఉపాధ్యాయులు

మహారాణిపేట: తమకు బకాయి ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని, 12వ పీఆర్సీ కమిషన్ నియమించి, మధ్యంతర భృతి ఇవ్వాలని ఉపాధ్యాయులు ఆందోళన చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) ఆధ్వర్యంలో 'నిరసన వారం'లో భాగంగా మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ నిరసనకు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.కరుణాకరరావు, ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణారావు నాయకత్వం వహించారు. 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, ఉద్యోగుల కుటుంబాలకు రూ. 25 లక్షల ఆరోగ్య బీమా పథకాన్ని వర్తింపజేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. 'అసెస్‌మెంట్ పుస్తకం'పై సమీక్ష జరపాలని, సీపీఎస్‌ను రద్దు చేసి 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానం అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా కరుణాకరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినా సంపాదిత సెలవు బిల్లులు, బీమా పథకాల మెచ్యూరిటీ మొత్తాలు, భవిష్య నిధి ఫైనల్ సెటిల్‌మెంట్లు, గ్రాట్యుటీ మొత్తాలు అన్నీ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రామకృష్ణారావు మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీఆర్వో భవానీ శంకర్‌కు అందజేశారు. ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి కొటాన శ్రీనివాసు, బొబ్బిలి ముత్యాల నాయుడు, బి.డి.కె.కుమారి పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

నవజాత శిశువుకు ప్రాణం పోసిన వైద్యులు



తల వెనుక భాగంలో పెద్ద గడ్డతో పుట్టిన నవజాత శిశువు



నవజాత శిశువు తల వెనుక భాగంలోని గడ్డను తొలగించిన తర్వాత..



శిశువు, తల్లిదండ్రులతో కేజీహెచ్ ఉన్నతాధికారులు

మహారాణిపేట: కేజీహెచ్‌లో అరుదైన, క్లిష్టమైన శస్త్రచికిత్స జరిగింది. జన్యుపరమైన సమస్యలతో తల వెనుక భాగంలో పెద్ద గడ్డతో జన్మించిన నవజాత శిశువుకు వైద్యులు ప్రాణం పోశారు. ఈ శిశువు ప్రస్తుతం క్షేమంగా కోలుకుని మంగళవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యింది. జూలై 31న అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం జి.కొత్తూరు గ్రామానికి చెందిన గర్భిణి వండలం సత్యవతిని ఆమె భర్త శ్రీనివాస్ గెమిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. ఆగస్టు 1న ఆమె ఆడ శిశువుకు జన్మనిచ్చారు. పుట్టుకతోనే శిశువు తల వెనుక పెద్ద గడ్డ ఉండటంతో అక్కడి వైద్యులు కేజీహెచ్‌కు పంపించారు. అదే రోజు శిశువును కేజీహెచ్‌లో చేర్చారు. వైద్యులు శిశువుకు ఎంఆర్ఐ స్కాన్ చేయగా.. అది 'జెయింట్ ఆక్సిపిటల్ మెనింగో ఎన్సెఫలోసిల్' అనే అరుదైన గడ్డ అని గుర్తించారు. వైద్య పరీక్షల అనంతరం ఈ నెల 6న న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ఎం.ప్రేమజీత్ రే ఆధ్వర్యంలో వైద్య బృందం శస్త్రచికిత్స నిర్వహించింది. బయటకు వచ్చిన మెదడు భాగాన్ని వైద్యులు జాగ్రత్తగా తొలగించి, తల భాగాన్ని సాధారణ స్థితికి తీసుకువచ్చారు. ఈ శస్త్రచికిత్స విజయవంతమైందని డాక్టర్ ప్రేమజీత్ రే తెలిపారు. ఇలాంటి వ్యాధి పదివేల మందిలో ఒకరికి వస్తుందని డాక్టర్ తెలిపారు. సాధారణంగా ఇలాంటి శిశువులు పుట్టిన వెంటనే లేదా శస్త్రచికిత్స తర్వాత మరణించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. శస్త్రచికిత్స తర్వాత శిశువు పూర్తిగా కోలుకుందని, అయితే భవిష్యత్తులో 'హైడ్రోసెఫలస్' వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. అందువల్ల ప్రతి నెలా న్యూరో సర్జరీ అవుట్ పేషెంట్ విభాగానికి తప్పకుండా రావాలని ఆ బిడ్డ తల్లిదండ్రులకు సూచించారు. ఈ అరుదైన శస్త్రచికిత్సను విజయవంతం చేసిన వైద్య బృందాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.రాధాకృష్ణన్, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ శ్రీహరి తదితరులు అభినందించారు.

ఎంపీడీవోలుగా 9 మందికి పదోన్నతులు



నియామక పత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జిల్లాలో పనిచేస్తున్న పరిపాలనాధికారులు(ఏవో), విస్తరణాధికారుల(ఈవోఆర్డీ)కు మండల పరిషత్ అభివృద్ధి అధికారులుగా(ఎంపీడీవో) పదోన్నతులు లభించాయి. మొత్తం 9 మందికి పదోన్నతులతో పాటు పోస్టింగ్‌లు ఇస్తూ జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ జె. సుభద్ర వారికి నియామక పత్రాలు అందజేశారు. జి.కె.వీధి ఎంపీడీవోగా బి.హెచ్.వి.రమణబాబు, బుచ్చయ్య పేట ఎంపీడీవోగా కె.ఎన్.సి.నారాయణరావు, రావికమతం ఎంపీడీవోగా ఒ.మహేష్, కశింకోట ఎంపీడీవోగా సి.హెచ్.చంద్రశేఖర రావు, కోటవురట్ల ఎంపీడీవోగా చంద్రశేఖరరావు, నాతవరం ఎంపీడీవోగా ఎం.ఎస్.శ్రీనివాసులు, ఎస్.రాయవరం ఎంపీడీవోగా మీనా కుమారి, పాయకరావుపేట ఎంపీడీవోగా విజయలక్ష్మి, ముంచంగిపుట్టు ఎంపీడీవోగా కె.ధర్మారావు నియమితులయ్యారు. డిప్యూటీ సీఈవో కె.రాజ్‌కుమార్, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సత్తిబాబు, నాయకులు పాల్గొన్నారు.

30న డిజిటల్ మారథాన్

మహారాణిపేట: ఆంధ్ర యువ సంకల్ప్ 2కే25–అంబాసిడర్ డిజిటల్ మారథాన్ కార్యక్రమం ఈ నెల 30న నిర్వహిస్తున్నారు. ఈ మారథాన్‌లో పాల్గొనే యువతీ, యువకుల వయసు 18 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలని, ఆసక్తి ఉన్న వారు https:// www.andhrayuvasankalp.com/ లో నమోదు చేసుకోవాలని సెట్విస్ సీఈవో కె.కవిత సూచించారు. ఆసక్తి ఉన్న వారు స్వయంగా రూపొందించిన 120 సెకన్ల నిడివి గల వీడియో/షార్ట్స్‌ను మార్గదర్శకాల్లో పేర్కొన్న అధికారిక హ్యాష్‌ట్యాగ్‌లతో తమ సోషల్ మీడియా ఖాతాల్లో పోస్ట్ చేయాలన్నారు.

ప్రభుత్వాన్ని మోసం చేసిన ఇద్దరికి ఐదేళ్ల జైలు

విశాఖ లీగల్ : కేంద్ర ప్రభుత్వాన్ని మోసం చేసిన ఒక ఉద్యోగితోపాటు మరో వ్యక్తికి ఐదేళ్ల చొప్పున జైలు శిక్ష విధిస్తూ నగరంలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి సీఎం మూర్తి మంగళవారం తీర్పునిచ్చారు. సీబీఐ కేంద్ర కార్యాలయం విడుదల చేసిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు కలక రామదాసు గతంలో శ్రీకాకుళం రేంజ్ పరిధిలోని సెంట్రల్ ఎక్సైజ్ పన్నుల శాఖ విభాగంలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసేవారు. మరో నిందితుడు పి.జానకిరామ్ కేంద్ర ప్రభుత్వ అధికారిగా చెలామణి అవుతూ బాలాజీ ట్రేడింగ్ కంపెనీ పేరుతో నకిలీ కంపెనీ స్థాపించాడు. 2010 ముందు బాలాజీ ట్రేడింగ్ కంపెనీ పేరుతో ముంబై మాలిగాన్ ప్రాంతాల్లో జానకీరామ్, కేశవరావు పేరుతో నకిలీ వ్యాపారం చేసి ప్రభుత్వానికి చెల్లించాల్సిన సుంకాలను ఎగ్గొట్టారు. దీనివల్ల దాదాపుగా రూ.32.28 కోట్లు ప్రభుత్వానికి నష్టం వాటిల్లింది. పన్నుల రూపంలో చెల్లించాల్సిన డబ్బులు చెల్లించలేదు. నకిలీ వ్యాపారం గుట్టు రట్టడంతో కేంద్ర నేరాన్వేషణ సంస్థ 2010లో నిందితులపై భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 120 బి, 419,420,471,468 లతోపాటు అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 13-1, 13 (2) కింద కేసు నమోదు చేసి నేరాభియోగపత్రాన్ని దాఖలు చేసింది. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పు చెప్పారు.

అధ్యయన యాత్రకు జీవీఎంసీ కార్పొరేటర్లు

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ కార్పొరేటర్లు అధ్యయన యాత్రకు మంగళవారం పయనమయ్యారు. మేయర్ పీలా శ్రీనివాసరావుతో పాటు 82 మంది కార్పొరేటర్లు, పలువురు అధికారులు విశాఖ విమానాశ్రయం నుంచి అధ్యయన యాత్రకు బయలుదేరి వెళ్లారు. వీరిలో 43 మంది మహిళా కార్పొరేటర్లు ఉన్నారు. ఈ నెల 24 వరకు జైపూర్, జోధ్‌పూర్, ఢిల్లీ ప్రాంతాల మున్సిపల్ కార్పొరేషన్లను పరిశీలించనున్నారు.

పత్రికా స్వేచ్ఛను హరిస్తామంటే ఎలా?



ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగం, ప్రభుత్వాల దృష్టికి తీసుకురావడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుంది. అలాంటి పత్రికల స్వేచ్ఛను పోలీసు కేసులతో ప్రభుత్వం హరిస్తామంటే ఎలా..? ఇటీవల సాక్షిలో ఒక రాజకీయ పార్టీ నేత మాట్లాడిన ప్రెస్‌మీట్ వార్తగా రాస్తే.. సంబంధిత జర్నలిస్టుతో పాటు ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై అక్రమ కేసు పెట్టి ప్రభుత్వం వేధిస్తోంది. మీడియా గొంతును నొక్కే ప్రయత్నాలకు పాల్పడుతోంది. అక్షరాన్ని, భావ ప్రకటన స్వేచ్ఛను నోటీసులు, అక్రమ కేసులతో పోలీసులు నిరోధించలేరు. మొదటి నుంచి కూటమి ప్రభుత్వం వాస్తవాలను వెలుగులోకి తెస్తున్న సాక్షిపై వేధింపులకు పాల్పడుతోంది. – పెట్ల ఉమా శంకర్ గణేష్, మాజీ ఎమ్మెల్యే



ప్రభుత్వ తీరు దారుణం



తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మొదటి నుంచీ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు బనాయిస్తోంది. తాజాగా పత్రికా స్వేచ్ఛను కూడా ప్రభుత్వం హరిస్తోంది. జర్నలిస్టులపై, సాక్షిపై వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉంది. విలేకరుల సమావేశంలో నాయకుల మాటలను వార్తలుగా ప్రచురిస్తే పత్రికలపై కేసులు పెట్టడం చరిత్రలో తొలిసారి. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపే బాధ్యత మీడియాపై ఉంది. రాష్ట్రంలోని ప్రజలు ప్రతీ అంశాన్ని గమనిస్తున్నారు. కచ్చితంగా కూటమి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు. – అన్నంరెడ్డి అదీప్‌రాజ్, మాజీ ఎమ్మెల్యే

పనిభారం, వేధింపులు

- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల గగ్గోలు
- నిరంతర సర్వేలతో సతమతం
- పదోన్నతులకు నోచుకోని వైనం
- సమ్మె బాటలో సచివాలయ సిబ్బంది



మహారాణిపేట : సచివాలయ వ్యవస్థ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సంబంధాలను బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషిస్తోంది. కానీ ఉద్యోగులపై పెరుగుతున్న పనిఒత్తిడి, అసంబద్ధమైన టార్గెట్లు ఈ వ్యవస్థ అసలు ఉద్దేశాన్ని దెబ్బతీస్తోంది. ప్రభుత్వ సేవలను, సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకు చేర్చాలనే గొప్ప లక్ష్యంతో 2019లో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ వ్యవస్థ ద్వారా ప్రజలకు 29 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన 540 రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో గతంలో 'మీ సేవ' కేంద్రాల చుట్టూ తిరిగే తిప్పలు తప్పాయి. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా మారిన సచివాలయ ఉద్యోగులు కూటమి ప్రభుత్వం వచ్చాక తీవ్రమైన పని ఒత్తిడితో సతమతమవుతున్నారు.

జాబ్ చార్ట్‌కు మించిన పనులు

గతంలో సచివాలయ ఉద్యోగులు తమ జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వహించేవారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, అదనపు పనుల భారం పెరిగిందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రతి సర్వేను సచివాలయ ఉద్యోగులకే అప్పగిస్తున్నారు. గతంలో వలంటీర్లు నిర్వహించిన పనులను కూడా ఇప్పుడు వీరే చూసుకోవాల్సి వస్తోంది.

అధికారుల వేధింపులు, టార్గెట్ల ఒత్తిడి

దిగువ స్థాయి అధికారుల నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు సచివాలయ ఉద్యోగులను టార్గెట్లతో వేధిస్తున్నారని జిల్లా గ్రామ సచివాలయం ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు ఆరోపిస్తున్నారు. జాబ్ చార్ట్‌కు సంబంధం లేని పనులను అప్పగించి, ప్రోగ్రెస్ పేరుతో ఒత్తిడి చేస్తున్నారు. వార్డు పరిపాలన కార్యదర్శులకు ఒకవైపు జియో ట్యాగింగ్ టార్గెట్లు ఇస్తూనే, మరోవైపు ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు చేయాలని బలవంతం చేస్తున్నారు. ఈ వసూళ్లను పెంచాలని తరచూ సమావేశాలు నిర్వహించి ఉద్యోగులను మానసిక క్షోభకు గురిచేస్తున్నారు. ఇలాంటి నిరంతర ఒత్తిడి వల్ల ఉద్యోగుల ఆరోగ్యం దెబ్బతింటోందని, మానసిక ఒత్తిడి వారిని కుంగదీస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఈ సమస్యపై దృష్టి సారించి, ఉద్యోగుల జాబ్ చార్ట్‌కు అనుగుణంగా మాత్రమే పనులు అప్పగించాలి. పనిభారాన్ని తగ్గించి, మానసిక ప్రశాంతతను కల్పించగలిగితేనే సచివాలయ వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేయగలుగుతుంది. లేకపోతే 'ఎంప్లాయిస్ ఫ్రెండ్లీ గవర్నమెంట్' అనే నినాదం కేవలం ప్రకటనలకే పరిమితం అవుతుంది.

ప్రధాన సమస్యలు

- ఉదయం 6 గంటలకే పెన్షన్ల పంపిణీకి వెళ్లాలి. రాత్రి 6.30 గంటల తర్వాత కూడా అధికారులు సమావేశాలు నిర్వహించి గంటల తరబడి కూర్చోబెడుతున్నారు. సెలవు రోజుల్లో కూడా వీరికి విశ్రాంతి లేకుండా పనులు అప్పగిస్తున్నారు.
- ఓడీఎఫ్ సర్వే (బాత్రూమ్‌ల ఫొటోలు), ఆర్‌డబ్ల్యూఎస్ పల్స్ సర్వే (కుళాయిల ఫొటోలు), పీ–4 సర్వే, పేదరిక నిర్మూలన సర్వే, విజన్ 2047 సర్వే వంటి అనేక రకాల సర్వేలు వీరిపై భారాన్ని పెంచుతున్నాయి.
- ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేయడం, స్టిక్కర్లు అంటించడం, హౌస్ టూ హౌస్ జియో ట్యాగింగ్ లాంటి అదనపు పనులు వీరిని మరింత ఒత్తిడికి గురిచేస్తున్నాయి.

సమ్మె నోటీసు ఇచ్చాం



సచివాలయ ఉద్యోగుల సమస్యలపై ఇప్పటికే పలు రకాల ఉద్యమాలు చేశాం. అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో సమ్మెకు నోటీసులు ఇచ్చాం. ఐదేళ్ల సర్వీసు పూర్తయినా ఇప్పటి వరకు పదోన్నతులు కల్పించలేదు. 15 రోజుల వ్యవధిలో సమస్యలను పరిష్కరించాలి. లేదంటే రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతాం.

– పి.జె.గణేష్ కుమార్, రాష్ట్ర జేఏసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఏపీ విలేజ్ వార్డు సెక్రటేరియట్ జేఏసీ

ఆందోళనకు సన్నాహాలు



గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులపై పెరుగుతున్న పనిఒత్తిడి తగ్గించాలి. అసంబద్ధమైన టార్గెట్లు విధించడం మానుకోవాలి. అన్ని శాఖల్లో పదోన్నతులు కల్పించాలి. ఉద్యోగుల సమస్యలపై అనేక సార్లు అధికారులకు వినతి పత్రం సమర్పించాం. స్పందన లేదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆందోళన చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం.

– పి.వి.కిరణ్‌కుమార్ యాదవ్, ఉపాధ్యక్షుడు, గ్రామ వార్డు సచివాలయం ఎంప్లాయిస్ ఫెడరేషన్

భార్యపై హత్యాయత్నం.. భర్తకు ఏడేళ్ల జైలు

విశాఖ లీగల్: భార్యను అతి క్రూరంగా గాయపరచిన వ్యక్తికి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ నగరంలోని మహిళా కోర్టు న్యాయమూర్తి వి.శ్రీనివాసరావు మంగళవారం తీర్పు చెప్పారు. జైలు శిక్షతో పాటు రూ.10,000 జరిమానా చెల్లించాలని, లేని పక్షంలో అదనంగా మరో ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి పేర్కొన్నారు. సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.ఖజానారావు అందించిన వివరాలివి. నిందితుడు సారే కొండబాబు (33) అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం, నువ్వు సింగ్ పంచాయతీ పరిధిలోని వలస మామిడి నివాసి. వృత్తిరీత్యా వ్యవసాయదారుడు. నిందితుడి అన్నయ్య చనిపోవడంతో.. అతని భార్యను కొండబాబు వివాహం చేసుకున్నాడు. అన్నయ్యకు ఒక కుమార్తె ఉంది. కొండబాబుకు ఇద్దరు పిల్లలు.. భార్యాభర్తలు, ముగ్గురు పిల్లలు కలిసి హాయిగా ఉండేవారు. కొండబాబు భార్య అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేసేది. అయితే నేరం జరగడానికి ముందు మూడు నెలల నుంచి భార్యాభర్తల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. నిందితుడు తన భార్యను అనుమానించేవాడు. ఈ నేపథ్యంలో 2024 ఏప్రిల్ 21న అర్ధరాత్రి ఇద్దరు గొడవపడ్డారు. నిందితుడు ఆగ్రహంతో ఒక పదునైన కత్తితో తన భార్యను తీవ్రంగా గాయపరిచాడు. తీవ్ర గాయాల మధ్య బాధితురాలిని కుటుంబ సభ్యులు మొదట పాడేరు ఆసుపత్రికి, అక్కడి నుంచి కేజీహెచ్‌కు తరలించారు. కొంతకాలం చికిత్స అనంతరం ఆమె ఆరోగ్యం కుదుటపడింది. జి.మాడుగుల పోలీసులు నిందితుడిపై భారతీయ శిక్షా స్మృతి సెక్షన్ 307 కింద కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్ఐ టి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి కోర్టులో నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ తీర్పు నిచ్చారు.

చిన్నారి 'ఖుషీ'ని బతికిద్దాం

నవ్వుల పువ్వులు పూయించాల్సిన ఆ పసిమొగ్గ కళ్లలో చెప్పలేని ఆవేదన. అమ్మా అని ఆప్యాయంగా పిలవాల్సిన గొంతులో అంతుచిక్కని మూగవేదన. 17 నెలలకే ఆ చిన్నారి జీవితంతో విధి వింత నాటకమాడింది. తోటి పిల్లల్లా ఆడుకోవాల్సిన వయసులో 'వెన్నెముక కండరాల క్షీణత(ఎస్ఎంఏ)' అనే అరుదైన లోపంతో కదల్లేని స్థితిలో మంచానికే పరిమితమైంది. తన బిడ్డ రోజూ అనుభవిస్తున్న నరకాన్ని చూస్తూ ఆ తల్లిదండ్రుల కంటిపై కునుకులేకుండా పోతోంది. ఆ పసి ప్రాణాన్ని నిలబెట్టే వైద్యం ఉన్నా.. దాని ఖరీదు రూ.9 కోట్లకు పైనే అని తెలిసి ఆ కుటుంబం నిలువునా కుంగిపోతోంది. ఇప్పుడు ఆ చిన్నారి 'ఖుషీ' నవ్వులు తిరిగి చూడాలంటే.. దాతల కరుణ, ప్రభుత్వ చేయూత తప్ప మరో మార్గం లేదు. – డాబాగార్డెన్స్

- స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీతో 17 నెలల చిన్నారి పోరాటం
- వైద్యం కోసం రూ.9కోట్లకుపైనే అవసరమని తేల్చిన వైద్యులు
- జోల్జెన్స్మా అనే ఒక్క ఇంజెక్షన్‌తో ప్రాణం నిలబడే అవకాశం
- ప్రభుత్వమే ఆదుకోవాలని తల్లిదండ్రుల వేడుకోలు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు



ఖుషీ13 నెలల ముందు..



ప్రస్తుతం ఇలా..

అల్లారుముద్దుగా పెంచుకుంటున్న ఆ చిన్నారి ఇంట్లో సందడి చేస్తుంటే ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేవు. కానీ ఆ సంతోషం ఎంతోకాలం నిలవలేదు. 17 నెలల చిన్నారి ఖుషీని 'స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ(ఎస్ఎంఏ) టైప్–2' అనే అరుదైన జన్యు సంబంధిత వ్యాధి కబళిస్తోంది. కండరాల కదలికలను స్తంభింపజేసే ఈ మహమ్మారి కారణంగా, ఆ చిన్నారి నడవలేని, కనీసం నిలబడలేని దుస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. రోజురోజుకూ క్షీణిస్తున్న తన బిడ్డను చూసి ఆ తల్లిదండ్రులు పడుతున్న వేదన వర్ణనాతీతం.

విషమంగా చిన్నారి ఆరోగ్యం

నగరానికి చెందిన డి.తరుణ్‌కుమార్, ఉషారాణి దంపతులకు రెండేళ్ల కిందట వివాహం కాగా.. ఖుషీ జన్మించింది. తరుణ్ కుమార్ ఓ ప్రైవేట్ ఫార్మా కంపెనీలో సాధారణ ఉద్యోగి. భార్య గృహిణి. ఎటువంటి ఆస్తుల్లేవ్. కాగా.. తమ గారాల పట్టి ఖుషీ పుట్టిన 13 నెలల వరకు వారి జీవితం ఆనందంగానే సాగింది. కానీ ఉన్నట్టుండి పాప తినడం, ఆడుకోవడం మానేసింది. ఆందోళనకు గురైన తల్లిదండ్రులు ఆరిలోవ హెల్త్ సిటీలోని వైద్యులను సంప్రదించారు. అన్ని పరీక్షలు నిర్వహించిన వైద్యులు.. పాప 'స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (ఎస్ఎంఏ) టైప్–2' తో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. ప్రస్తుతం ఆ చిన్నారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది.

కన్నీటి సంద్రంలో తల్లిదండ్రులు

ఈ వ్యాధికి చికిత్స ఉందని వైద్యులు చెప్పగానే ఆ తల్లిదండ్రుల కళ్లలో ఆశ మెరిసింది. కానీ.. దానికి అయ్యే ఖర్చు అక్షరాలా రూ.9 కోట్లు అని తెలియగానే వారి కాళ్ల కింద భూమి కంపించినట్టయింది. జోల్జెన్స్మా అనే ఒక్కసారి ఇచ్చే జన్యు చికిత్స ఇంజక్షన్‌తో పాపను బతికించుకోవచ్చని, అయితే అది తక్షణమే అందించాలని వైద్యులు చెబుతున్నారు. ఇప్పటికే అప్పులు చేసి పాపకు వైద్యం అందిస్తున్న ఆ మధ్యతరగతి కుటుంబానికి రూ.9 కోట్లకు పైనే సమకూర్చడం అనేది ఊహకు కూడా అందని విషయం. బిడ్డను ఎలా బతికించుకోవాలో తెలియక ఆ తల్లిదండ్రులు కన్నీటి సంద్రంలో మునిగిపోయారు.

ప్రభుత్వం, దాతలే ఆధారం

'మా లాంటి వాళ్లకు ఇన్ని కోట్లు తేవడం ఎలా సాధ్యం? మా బిడ్డ ప్రాణాలను కాపాడటానికి ప్రభుత్వమే చొరవ చూపాలి. విశాఖ ఎంపీ, ఎమ్మెల్యేలు మా గోడును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకోవాలి.' అని చిన్నారి తల్లిదండ్రులు కన్నీటితో వేడుకుంటున్నారు. 'మా పాప మళ్లీ నవ్వాలంటే, మాతో ఆడుకోవాలంటే దాతలు కరుణించాలి. మీరందించే చిన్న సాయం కూడా మా బిడ్డకు ప్రాణం పోస్తుంది.' అంటూ వారు వేడుకుంటున్నారు. ఆర్థిక సహాయం అందించాలనుకునే వారు 73067 16745 నంబరులో సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చు. దాతలు, ప్రభుత్వం సహకరిస్తే ఆ పసిమొగ్గ జీవితంలో మళ్లీ 'ఖుషీ' నింపవచ్చు.

భాగస్వామ్య సదస్సుకు పకడ్బందీ ఏర్పాట్లు

జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్



ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

డాబాగార్డెన్స్ : విశాఖ వేదికగా వచ్చే నవంబర్‌లో నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సుకు జీవీఎంసీ చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. భాగస్వామ్య సదస్సు నిర్వహించే ఏయూ గ్రౌండ్ ప్రధాన వేదిక, ఇతర ప్రాంతాలను కమిషనర్ మంగళవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈ సదస్సుకు ఎంతో మంది అతిథులు తరలిరానున్నారని, అందుకు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాలపై గ్రీన్ మ్యాట్‌లు కప్పేలా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ ముఖ్య పట్టణ ప్రణాళికాధికారి ప్రభాకరరావును ఆదేశించారు. నగర సుందరీకరణలో భాగంగా సెంటర్ మీడియన్లలో పచ్చదనం, చెట్ల ట్రిమ్మింగ్, ఏయూ గ్రౌండ్ రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌లకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి, ఆ ప్రాంతాల్లో పచ్చదనం అభివృద్ధి పరచాలని డీడీహెచ్ దామోదరరావును ఆదేశించారు. ఇంజినీరింగ్ పనుల్లో భాగంగా 26 స్ట్రెచ్ ప్రాంతాల్లో దృష్టి సారించి, ఫుట్‌పాత్‌లు, రోడ్లు, పెయింటింగ్, లైటింగ్ వంటి అభివృద్ధి పనులకు సంబంధించి నివేదిక సిద్ధం చేయాలని ప్రధాన ఇంజినీర్ పీవీవీ సత్యనారాయణరాజును ఆదేశించారు. సదస్సు జరిగే వరకూ అధికారులతో ప్రతి వారం సమీక్షలు నిర్వహిస్తూ సమన్వయ పనులపై దృష్టి సారించాలని అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మను ఆదేశించారు. సదస్సుకు నిర్వహించే పనుల్లో యూఐఎంఎల్ ప్రతినిధి చేతన్‌ను భాగస్వామ్యం చేయాలని ప్రధాన ఇంజినీర్‌కు సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణకు పిన్ పాయింట్ వారీగా కార్మికులను సర్దుబాటు, తదితర అంశాలపై ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్‌ను ఆదేశించారు. పర్యటనలో జోనల్ కమిషనర్లు కె.శివప్రసాద్, మల్లయ్యనాయుడు, పర్యవేక్షక ఇంజనీర్లు సంపత్‌కుమార్, కె.శ్రీనివాసరావు, కార్యనిర్వాహక ఇంజనీర్లు గంగాధర్, సుధాకర్, ఏసీపీ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

ఇటుకతో మోది వృద్ధుడి దారుణ హత్య



పరదేశి మృతదేహం



స్థానికులను విచారిస్తున్న పోలీసులు

- నిందితుడికి మతిస్థిమితం లేదంటున్న కుటుంబసభ్యులు
- యల్లపువానిపాలెంలో విషాదం

గోపాలపట్నం: యల్లపువానిపాలేనికి చెందిన వృద్ధుడిని మతిస్థిమితం లేని యువకుడు ఇటుకతో మోది హత్య చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. యల్లపువానిపాలెం నుంచి విమాన్‌నగర్‌కు వెళ్లే మార్గంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గోపాలపట్నం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి. భీశెట్టి పరదేశి(79) మంగళవారం తన పశువులను మేత కోసం సమీపంలోని రైల్వే ట్రాక్ ప్రాంతంలో విడిచి పెట్టి వచ్చాడు. మధ్యాహ్నం సమయంలో పశువులను చూసేందుకు వెళ్లగా.. అదే గ్రామానికి చెందిన అలమండ నితీష్ ఆ ప్రాంతానికి వచ్చాడు. నితీష్ ఒక్కసారిగా పరదేశిపై దాడికి పాల్పడ్డాడు. స్థానికులు కేకలు వేసి వారించేందుకు ప్రయత్నించినా, అతను పట్టించుకోలేదు. దగ్గరికి వస్తే చంపేస్తానని బెదిరించాడు. వృద్ధుడిని కింద పడేసి, ఇటుకతో తలపై మోదడంతో పరదేశి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనను చూసిన స్థానికులు వెంటనే గోపాలపట్నం పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐలు అప్పలనాయుడు, రామారావు వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్ కూడా ఆధారాలను సేకరించింది. నిందితుడు నితీష్‌కు మతిస్థిమితం లేదని, గత ఏడాది మానసిక ఆసుపత్రిలో చికిత్స పొందాడని అతని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. పరదేశికి కుమారుడు ఈశ్వరరావు ఉన్నారు. తన తండ్రి గేదెలను నిందితుడి ఇంటి ముందు నుంచి తీసుకెళ్తుంటే, నితీష్ గొడవ పడేవాడని, ఆ కోపంతోనే తన తండ్రిని హత్య చేశాడని పరదేశి కుమారుడు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాంగి కరుణకు సత్కారం

కొమ్మాది: భారత అంధుల జట్టుకు ఎంపికైన పాంగి కరుణకుమారిని జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర సత్కరించి అభినందించారు. దేశంలో తొలిసారిగా టీ–20 అంధుల ప్రపంచ క్రికెట్ కప్ జరగనున్న సంగతి తెలిసిందే. సాగర్‌నగర్‌లోని ప్రభుత్వ అంధుల బాలికల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన కరుణ భారత జట్టుకు ఎంపికైంది. కాగా.. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా కరుణ మాట్లాడుతూ తనకు క్రికెట్‌లో శిక్షణ ఇచ్చిన పీఈటీకి ధన్యవాదాలు తెలిపారు. కరుణను అభినందించిన జడ్పీ చైర్‌పర్సన్.. క్రీడలకు సంబంధించిన పరికరాలతో పాటు అవసరమైన సహాయాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు.